మొదటి పేజి తరువాయి

## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు

టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మరోవైపు, ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వైసీపీ ఈ రాద్ధాంతం చేస్తోందని అప్పసాని రాజేశ్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వేసిన 320 కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలనలో 'జాబ్‌లెస్ క్యాలెండర్'తో యువతను మోసం చేసిన జగన్, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి..
## రంగంలోకి రెవెన్యూ అధికారులు

కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఖైరతాబాద్ గణపతికి ప్రత్యేక పూజలు చేసిన హరీశ్ రావు.. పర్యావరణహిత వేడుకలపై ప్రశంసలు

కలిసి ఆయన స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... చార్మినార్, గోల్కొండ కోటల మాదిరిగానే హైదరాబాద్ అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్‌ను నలుదిశలా సగర్వంగా చాటడంలో ఖైరతాబాద్ వినాయకుడి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. కేవలం పరిమాణంలోనే కాక, భక్తుల నమ్మకంలోనూ ఇది 'బడియా గణేశ్'గా నిలిచిందని అభివర్ణించారు. ఈ ఏడాది 69 అడుగుల భారీ ఎత్తులో పూర్తిగా మట్టితో రూపుదిద్దుకున్న పంచముఖ సంకట మహాగణపతిని ప్రతిష్ఠించి ఉత్సవ కమిటీ పర్యావరణ పరిరక్షణకు గొప్ప సందేశమిచ్చిందని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణానికి ముప్పు లేని మట్టి వినాయకులనే పూజించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. మరోవైపు ఉత్సవాలను ఎంత వైభవంగా నిర్వహిస్తున్నామో, నిమజ్జన ఘట్టంలోనూ అంతే అప్రమత్తత అవసరమని నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల పటాన్‌చెరు పరిధిలో నిమజ్జనం సమయంలో చోటుచేసుకున్న విషాదకర సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా ముందస్తుగా ప్రభుత్వ యంత్రాంగం, ఉత్సవ సమితులు సమన్వయంతో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు, భక్తులకు స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆయన కోరుకున్నారు.

## ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్‌గా తవెంగ్వా ముకులాని.. చరిత్రలో తొలిసారిగా జింబాబ్వేకు అవకాశం

ఢిల్లీ : అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కొత్త డిప్యూటీ ఛైర్మన్‌గా జింబాబ్వేకు చెందిన తవెంగ్వా ముకులాని నియమితులయ్యారు. ఐసీసీ బోర్డు డైరెక్టర్లు ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న ఇమ్రాన్ ఖ్వాజా స్థానంలో ముకులానీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ఈ పదవిలో 2027 నవంబర్ వరకు కొనసాగుతారు. ఈ నియామకంతో ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ పదవిని అలంకరించిన తొలి జింబాబ్వే వ్యక్తిగా ముకులాని చరిత్ర సృష్టించారు. ప్రస్తుతం ముకులాని జింబాబ్వే క్రికెట్ బోర్డు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఐసీసీలో జింబాబ్వే ప్రతినిధిగా ఉండటంతో పాటు, ఫైనాన్స్ అండ్ కమర్షియల్ అఫైర్స్ నామినేషన్స్ కమిటీలలో సభ్యుడిగా, హెచ్ఆర్ అండ్ రెమ్యూనరేషన్ కమిటీకి హెడ్ గానూ పనిచేస్తున్నారు. దక్షిణాఫ్రికా, నమీబియాలతో కలిసి 2027 ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచకప్‌కు జింబాబ్వే సహ-ఆతిథ్యం ఇవ్వనున్న తరుణంలో ముకులాని నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. దాదాపు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రపంచకప్ మళ్లీ ఆఫ్రికాకు తిరిగి వస్తున్న వేళ, ఆయన అనుభవం ఐసీసీకి కీలకం కానుంది. ఈ సందర్భంగా ముకులాని మాట్లాడుతూ.. "నాపై నమ్మకం ఉంచిన ఐసీసీ బోర్డు డైరెక్టర్లకు కృతజ్ఞతలు. ఐసీసీ ఛైర్మన్ జై షా నాయకత్వంలో పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను. ఆయన మార్గదర్శకత్వంలో క్రికెట్‌ను మరింతగా విస్తరించేందుకు కృషి చేస్తాను. ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం వంటి ఉత్తేజకరమైన ఈ సమయంలో, ప్రపంచ క్రికెట్ ప్రయోజనాల కోసం పనిచేస్తాను" అని తెలిపారు. ఐసీసీ ఛైర్మన్ జై షా స్పందిస్తూ.. "డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికైన తవెంగ్వా ముకులానీకి అభినందనలు. క్రికెట్ పరిపాలనలో ఆయన అనుభవం, ప్రపంచ ఆటపై ఆయనకున్న అవగాహన ఐసీసీ బోర్డుకు అమూల్యమైనవి. ఆయన నియామకం జింబాబ్వేకు ఒక చారిత్రక మైలురాయి. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌ను బలోపేతం చేయడానికి ఆయనతో కలిసి పనిచేస్తాను" అని పేర్కొన్నారు.

## ట్రంప్ తనయులకు సంబంధించిన కంపెనీతో పాక్ డీల్..

పాక్‌లో ప్రైవేటు డిఫెన్స్ సంస్థలు ఇంకా శైశవ దశలో ఉన్నందుకు తమ లాంటి సంస్థల అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇక పాక్‌లో డిఫెన్స్ ఉత్పత్తుల తయారీకి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని కూడా వెలికోవిచ్ తెలిపారు. ఈ డీల్ వెనుక ట్రంప్ కుటుంబం ఇన్‌ఫ్లుయెన్స్ ఉందన్న వాదనలను సంస్థ సీఈఓ ఫాక్స్ కొట్టిపారేశారు. కేవలం తమ ప్రతిభ, గుర్తింపు ఆధారంగా పాక్ నుంచి ఈ కాంట్రాక్ట్ దక్కించుకున్నామని చెప్పారు. తమ కంపెనీ రోజువారీ కార్యకలాపాలు, నిర్వహణలో ట్రంప్ తనయులు పాలుపంచుకోరని స్పష్టం చేశారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, అమెరికన్ వెంచర్స్ అనే ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ద్వారా ట్రంప్ సోదరులు ఆరియస్ సంస్థలో పెట్టుబడి పెట్టారు. ఆరియస్, పవర్‌అజ్ విలీనం తరువాత సంస్థలో ట్రంప్ సోదరుల వాటా 9.9 శాతంగా ఉంటుందని సమాచారం. ఈ పరిణామాలపై డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ప్రతినిధి స్పందించారు. ట్రంప్ జూనియర్ కేవలం పెట్టుబడిదారుగా మాత్రమే ఉన్నారని అన్నారు. కంపెనీ నిర్వహణ, కాంట్రాక్ట్‌లు వంటి విషయాలతో ఆయనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ ఉదంతంపై ఎరిక్ ట్రంప్ ఇంకా స్పందించాల్సి ఉంది.

## తిరుమల చేరుకున్న ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్.. రేపు శ్రీవారి దర్శనం

ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్, రిసెప్షన్ అధికారులు భాస్కర్, సాత్రే నాయక్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు, రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్‌కు జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు విమానాశ్రయంలో గవర్నర్‌కు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

## చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు: రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్

సీఎం రేవంత్ రెడ్డి సైతం ఎంఐఎంకు అనుకూలంగా ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా నిజాం పాలకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పొగడటాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "నిజాం నిజంగానే మంచివాడైతే తెలంగాణ విమోచన కోసం సాయుధ పోరాటాలు ఎందుకు చేయాల్సి వచ్చింది? 'ఆపరేషన్ పోలో' ఎందుకు చేపట్టాల్సి వచ్చింది?" అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ఈ తరహా ఓటు బ్యాంక్ రాజకీయాలకు రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## ఛార్జీల విషయంలో అమెరికా ఒత్తిడి ఉందా?

యూపీఐపై కొత్తగా తీసుకొచ్చిన 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్-ఎండీఆర్ నిర్ణయం ఇప్పుడు రాజకీయంగా చర్చకు దారితీసింది. ఆ ఛార్జీల నిర్ణయం వెనుక అమెరికా ఒత్తిడి ఉందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కేంద్ర ఆర్థిక శాఖ ఖండించింది. ఇందులో ఎలాంటి విదేశీ ఒత్తిడి లేదని స్పష్టం చేసింది. అంతర్జాతీయ క్రెడిట్ కార్డులకు యూపీఐలో అవకాశం కల్పించేందుకే ఆ నిర్ణయం తీసుకున్నారన్న వాదనలో నిజం లేదని తెలిపింది.


### అమెరికా కార్డులకు ప్రయోజనం ఏంటి?

యూపీఐలో క్రెడిట్ లావాదేవీలకు ప్రస్తుతం రూపే క్రెడిట్ కార్డులకు మాత్రమే అవకాశం ఉందని ఆర్థిక శాఖ ఆధ్వర్యంలోని ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగం-ఐఖీ స్పష్టం చేసింది. సెప్టెంబర్ 15న ఎన్‌పీసీఐ విడుదల చేసిన తాజా సర్క్యులర్‌లో కూడా ఇదే విధానం ఉందని తెలిపింది. ఇతర దేశాలకు చెందిన క్రెడిట్ కార్డులను యూపీఐ క్రెడిట్ లావాదేవీలకు అనుసంధానం చేసే అవకాశం ఇవ్వలేదని పేర్కొంది. అందువల్ల 0.4 శాతం ఎండీఆర్ నిర్ణయం అమెరికా క్రెడిట్ కార్డు సంస్థలకు ప్రయోజనం కల్పించేందుకు తీసుకున్నదనే ఆరోపణకు ఆధారం లేదని కేంద్రం చెబుతోంది. యూపీఐలో రూపే క్రెడిట్ కార్డులను వినియోగదారులకు ప్రధాన ఎంపికగా మార్చడమే తమ విధానమని ఐఖీ తెలిపింది. అమెరికా ఎలక్ట్రానిక్ చెల్లింపుల సంస్థలకు యూపీఐలో సమాన అవకాశాలు లేవంటూ అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం-యూఎస్‌టీఆర్ 2026 నివేదికలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్రం వివరణ ఇచ్చింది. ఎన్‌పీసీఐ ప్రకారం, ఎంపిక చేసిన అధిక విలువైన యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ తీసుకురావడం వెనుక ప్రధాన కారణం డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు ఆదాయ నమూనా కల్పించడమే. యూపీఐలో ప్రస్తుతం పెద్ద సంస్థల ఆధిపత్యం ఎక్కువగా ఉందని కేంద్రం చెబుతోంది. 2020లో థర్డ్ పార్టీ యాప్ ప్రొవైడర్లకు 30 శాతం మార్కెట్ వాటా పరిమితిని ఎన్‌పీసీఐ తీసుకొచ్చింది. అయితే చిన్న కంపెనీలు మార్కెట్లో పెద్ద సంస్థలతో పోటీ పడేందుకు తగిన ఆదాయ మార్గం లేకపోవడంతో ఆ పరిమితిని అమలు చేయడం కష్టంగా మారిందని తెలిపింది. ఎంపిక చేసిన అధిక విలువ లావాదేవీలపై ఎండీఆర్ విధించడం ద్వారా చిన్న సంస్థలకు కూడా ఆదాయ మార్గం ఏర్పడుతుందని

## టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీ - భారత్ అభివృద్ధిని ఎవరూ ఆపలేరు: చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

కాశీ విశ్వనాథ్ ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. రక్షణమంత్రి రాజ్ నాథ్, కేంద్రమంత్రులు చిరాగ్ పాసవాన్, పంకజ్ చౌదరి, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తో కలిసి సీఎం చంద్రబాబు ఆలయంలో పూజలు నిర్వహించారు. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు : అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడారు, "ఇండియా అభివృద్ధి చెందిన దేశంగా మారబోతుంది. భారత్ అభివృద్ధిని ఎవరూ ఆపలేరు. సానుకూల దృక్పథం ఉంటే ఉన్నతస్థానాలకు వెళ్లగలరు. దేశంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్‌బియ్యం పంపిణీ జరుగుతుంది. ప్రధాని మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ప్రతి పేదవాడికి తాగునీరు అందించాలనేదే ప్రధాని లక్ష్యం. సుమారు 11 కోట్లమంది పీఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. మధ్యవర్తులు లేకుండా రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తున్నారు. కొవిడ్



సంక్షోభంలోనూ ప్రధాని మోదీ మంచి పాలన అందించారు. కొవిడ్ సమయంలో 140 కోట్ల మందిని ప్రధాని మోదీ కాపాడారు. ప్రధాని మోదీ ఉచితంగా దేశ ప్రజలకు కొవిడ్ వ్యాక్సిన్లు వేశారు. ప్రపంచంలోని 101 దేశాలకు ప్రధాని మోదీ కొవిడ్ వ్యాక్సిన్లు పంపారు. గతంలో భారత్ ఆయుధాలను దిగుమతి చేసుకునేది, ప్రస్తుతం భారత్‌లోనే ఆయుధాల ఉత్పత్తి జరుగుతుంది. టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీనే. మహిళలే కేంద్రంగా దేశంలో అభివృద్ధి జరుగుతుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. "మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టం చేశారు. బేటీ బచావో బేటీ పడావో, ఉజ్వల సహా తదితర పథకాల ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతోంది. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టం చేశారు. భారత్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతోందో ప్రధాని చూపించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ సత్తాను ప్రధాని మోదీ ప్రపంచానికి చూపించారు. దేశంలో తీవ్రవాదం లేకుండా ప్రధాని మోదీ చర్యలు చేపట్టారు. ప్రధాని మోదీ చర్యల వల్ల దేశంలో తీవ్రవాదం అంతమైంది. సుదీర్ఘకాలం నలిగిన అయోధ్య సమస్యను ప్రధాని పరిష్కరించారు. అయోధ్యలో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మిస్తాం.

## రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం: కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం

మొదటి పేజి తరువాయి

జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ



చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

# సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్
# ఆవిష్కరణలు, పెట్టుబడులకు కొత్త అవకాశాలు

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. ఇప్పటికే దేశంలో 12 చిప్ తయారీ ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని ప్రధాని వెల్లడించారు. రానున్న దశలో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పారు. చిప్ డిజైన్, అసెంబ్లీకి మాత్రమే పరిమితం కాకుండా, చిప్ తయారీ, అధునాతన ప్యాకేజింగ్, పరికరాలు, ముడి పదార్థాలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని రంగాలను కలిపి పూర్తి సెమీకండక్టర్ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని వివరించారు.

### మిషన్ 2.0కు భారీగా నిధులు

భారత్ సెమీకండక్టర్ మిషన్ 2.0 కింద ప్రభుత్వం కేటాయింపులను భారీగా పెంచిందని మోదీ తెలిపారు. మొదటి దశలో 8 బిలియన్ డాలర్లుగా ఉన్న కేటాయింపులను 13.5 బిలియన్ డాలర్లకు పెంచినట్లు చెప్పారు. సెమీకండక్టర్ పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. దేశంలో సెమీకండక్టర్ రంగం ఎదగడం వల్ల పెట్టుబడులు పెరగడంతో పాటు



కొత్త కంపెనీలు, ఉద్యోగాలు, పరిశోధన అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో కొన్ని ప్రాంతాలపై ఉన్న ఆధారాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో భారత్‌కు ఇది ఒక పెద్ద అవకాశంగా మారుతుందని చెప్పారు.

### 15 రోజుల్లోనే!

భారత్ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో గత 15 రోజుల పరిణామాలను చూస్తే అర్థమవుతుందని మోదీ అన్నారు. సెప్టెంబర్‌లో ముంబయిలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ జరిగిందని గుర్తుచేశారు. అక్కడ ఏజెంటిక్ ఏఐ, టోకనైజేషన్, క్వాంటం టెక్నాలజీల ద్వారా సమ్మిళిత ఆర్థిక సేవలపై చర్చ జరిగిందన్నారు. అదే సమయంలో దేశంలో సుమారు 3 వేల కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. దీనివల్ల దేశవ్యాప్తంగా సరుకు రవాణా వేగం పెరుగుతుందని, లాజిస్టిక్స్ మరింత మెరుగవుతాయని తెలిపారు. మెరుగైన రవాణా వ్యవస్థ తయారీ రంగానికి మరింత బలాన్ని ఇస్తుందని మోదీ చెప్పారు.

### ఆర్థిక వృద్ధి- ప్రపంచ నమ్మకం

భారత్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని ప్రధాని అన్నారు. అదే సమయంలో ప్రపంచ దేశాలకు భారత్‌పై ఉన్న విశ్వాసం కూడా పెరుగుతోందని చెప్పారు. ప్రస్తుత సవాళ్ల మధ్య కూడా దేశం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధిని నమోదు చేసిందని పేర్కొన్నారు. జపాన్‌కు చెందిన రేటింగ్ సంస్థ జేసీఆర్ఏ భారత్ రేటింగ్‌ను పెంచిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. భారత్‌లో తయారీ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ సరఫరా వ్యవస్థలో కీలక భాగస్వామిగా ఎదగడానికి సెమీకండక్టర్ రంగం ఉపయోగపడుతుందని మోదీ తెలిపారు.

## కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన కేటీఆర్

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ముఖ్యమంత్రి విషప్రచారం చేస్తున్నారని, ఇందుకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌కు ఉన్నది 1,000 ఎకరాలు కాదని, కేవలం 67 ఎకరాలు మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రే అసెంబ్లీ వేదికగా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ముఖ్యమంత్రికి ఓ సవాల్ విసిరారు. "కేసీఆర్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మా కుటుంబం ఆస్తులపై పూర్తిస్థాయి విచారణకు మేము సిద్ధం. మరి పుట్టినప్పటి నుంచి మీ ఆస్తులపై విచారణకు మీరు సిద్ధమా?" అని రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవసాయాన్ని ప్రేమించే నిజమైన రైతు అని, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన సాగు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కొందరు భూమిని ఒక వ్యాపార వస్తువుగా చూస్తే, కేసీఆర్ మాత్రం దానిని ఎంతో పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై అనవసర రాద్ధాంతం చేస్తూ రేవంత్ రెడ్డి 'సెల్ఫ్ గోల్' చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల ఆస్తి ఉండేదని, చింతమడకలోని తమ పాత ఇంటిని ప్రభుత్వ పాఠశాల కోసం విరాళంగా ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. 22ఏ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు



ఎండగడతామని ఆయన పునరుద్ఘాటించారు.

# 2వేల పానీపూరీలతో 13 అడుగుల గణేశుడి విగ్రహం తయారీ

మొదటి పేజి తరువాయి

### పానీపూరీలతో భారీ గణపతి- వైరల్ అవుతున్న వినూత్న విగ్రహం వీడియో
### రెండు నెలల పాటు శ్రమించి గణేశుడి విగ్రహానికి ప్రాణం పోసిన కళాకారులు

ఢిల్లీ : దేశవ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఈ నవరాత్రుల్లో భక్తులు తమ భక్తికి సృజనాత్మకతను జోడించి వినూత్న రీతిలో భారీ గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించడాన్ని మనం చూస్తుంటాం. ఈ ఏడాది కూడా మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వీటిలో పుణెలో కొలువుదీరిన 'పానీపూరీ గణపతి' విగ్రహం ఒకటి. ఈ పానీపూరీ గణనాథుడ్ని చూసేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. అందుకే ఈ స్టోరీలో ఈ భిన్నమైన విగ్రహ తయారీకి ఎన్ని పానీపూరీలను వాడారు? ఆ విగ్రహం ఎత్తు ఎంత? దాన్ని ఎవరు తయారుచేశారు? తదితర విషయాలు తెలుసుకుందాం.

### రెండు నెలలు శ్రమించి

పుణెలోని ఫెర్గూసన్ కాలేజ్ రోడ్డులో ఉన్న 'గణేశ్ భేల్' షాపు యజమానులైన రూపేశ్, దినేశ్ గుడ్మేవార్ (ఇద్దరు సోదరులు) ఈ వినూత్న బొజ్జ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 21,000 పానీపూరీలను ఉపయోగించి 13 అడుగుల ఎత్తైన విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇద్దరు సోదరులు రెండు నెలల పాటు శ్రమించి ఈ విగ్రహానికి అందమైన రూపానిచ్చారు. అంతేకాకుండా ఈ విగ్రహం పాడవకుండా ఉండేందుకు, దాని భద్రతను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఇద్దరు కళాకారులు నిరంతరం మండపం వద్దే ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ పానీపూరీ గణపయ్యకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

### సోదరుల అద్భుత కళాఖండం



స్వతహాగా కళాకారులైన రూపేశ్, దినేశ్ గుడ్మేవార్‌లు తమ వ్యాపారానికి సంబంధించిన పదార్థాలను ఉపయోగించి గణపయ్యకు ఒక విలక్షణమైన రూపాన్ని ఎలా ఇవ్వొచ్చని ఆలోచించారు. అప్పుడే వారికి తమ వ్యాపారంలో ముఖ్య భాగమైన పానీపూరీలతో గణేశుడి విగ్రహాన్ని తీర్చిదిద్దాలనే ఆలోచన వచ్చింది. అయితే ఈ ఆలోచన వినడానికి సులభంగా అనిపించినా, దానిని ఆచరణలో పెట్టడం అంత సులభం కాదనే విషయాన్ని ఆ సోదరులు గ్రహించారు. ఎందుకంటే పానీపూరీలు తేలికగా ఉంటాయి. అలాగే తేమకు సులభంగా ప్రభావితమవుతాయి. అందుకే విగ్రహం ఆకృతికి, స్థిరత్వానికి భంగం కలగకుండా పానీపూరీలను ఎలా అమర్చవచ్చనే దానిపై ఆ సోదరులు సుమారు ఆరు నెలల పాటు చర్చించి, అధ్యయనం చేశారు. రెండు నెలల క్రితం విగ్రహం రూపకల్పన పనులు ప్రారంభించారు.

'పూజ, దర్శనం కోసం వేరే విగ్రహం ఏర్పాటు'

వెదురు, కాగితంతో చేసిన ఫ్రేమ్‌పై 13 అడుగుల గణపతి విగ్రహం రూపుదిద్దుకునే వరకు పానీపూరీలను ఒక్కొక్కటిగా అమర్చామని రూపేశ్ వివరించారు. ఈ పెద్ద విగ్రహాన్ని కేవలం కళాత్మక ప్రదర్శన కోసం మాత్రమే రూపొందించామని చెప్పారు. పూజ, దర్శనం కోసం దాని పక్కన ఒక చిన్న గణేశుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించామని వెల్లడించారు. అందువల్ల భక్తులు పానీపూరీలతో చేసిన గణేశుడి విగ్రహాన్ని సందర్శించి, పక్కనే ఉన్న చిన్న విగ్రహం వద్ద పూజలు చేస్తున్నారని స్పష్టం చేశారు. "పానీపూరీలతో చేసిన ఈ ప్రతిష్ఠాత్మక గణేశుడి విగ్రహాన్ని చెక్కుచెదరకుండా చూసుకోవడం అంత సులువైన పని కాదు. అందుకే 24 గంటలూ అప్రమత్తంగా ఉంటున్నాం. ఎందుకంటే గాలిలో తేమ వల్ల పానీపూరీలు మెత్తగా అయిపోతాయి. అలాగే దుమ్ము, ధూళి, తేమ వల్ల పాడైపోతాయి. అందుకే విగ్రహాన్ని పర్యవేక్షించడానికి, ఏవైనా సమస్యలు వస్తే వాటిని పరిష్కరించడానికి ఇద్దరు కళాకారులు మండపంలోనే ఉంటారు. పుణెలోని అనూహ్యమైన రుతుపవన వాతావరణం నుంచి ఈ భిన్నమైన విగ్రహాన్ని కాపాడటానికి అదనపు జాగ్రత్తలు కూడా తీసుకున్నాం" అని దినేశ్ స్పష్టం చేశారు.

### సేంద్రీయ ఎరువుగా మారనున్న పానీపూరీలు

గణేశ్ నవరాత్రుల తర్వాత ఈ పానీపూరీ గణేశుడి విగ్రహాన్ని నిమజ్జనం చేయమని సోదరులిద్దరూ (రూపేశ్, దినేశ్) చెప్పారు. అనంత చతుర్దశి తర్వాత అందరిలా ఈ విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేయమని స్పష్టం చేశారు. అందుకు బదులుగా విగ్రహ తయారీలో వాడిన 21,000 పానీపూరీలను సేంద్రియ ఎరువుల తయారీకి ఉపయోగిస్తామని అన్నారు. ఆహార పదార్థాలు జలాశయాల్లోకి చేరకుండా నివారించడం, అలాగే ఈ వేడుకను పర్యావరణహితంగా జరుపుకోవాలనే సందేశాన్ని ఇవ్వడం కోసం తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జనం

# ప్రశాంతంగా జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టాం

అనంతపురం క్రైం ప్రతినిధి, సెప్టెంబర్ 17 అనంత సూర్య : జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా.. మత-సామరస్యాన్ని కించపరిచే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. నగరంలో శుక్రవారం జరిగే గణేష్ నిమజ్జనం కార్యక్రమం ప్రశాంతంగా ముగిసేలా పటిష్ట పోలీసు బందోబస్తు చేపట్టామని జిల్లా ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు.. మరీ ముఖ్యంగా యువత పోలీసులతో సహకరించాలని కోరారు. ఆనందంగా, సంతోషకర వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. శోభాయాత్ర, నిమజ్జనం నేపథ్యంలో అనంతపురం పోలీస్ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బందోబస్తులో భాగంగా పోలీసు సిబ్బందితో పాటు అత్యాధునిక సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తున్నామని తెలిపారు. క్రమ పద్ధతిలో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు కమిటీ సభ్యులు సహకరించాలని, సకాలంలో నిమజ్జన ప్రక్రియ జరిగేందుకు కమిటీల తరపున వాలంటీర్లను నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శోభాయాత్ర ప్రాంభం నుండే తగు జాగ్రత్తలు తీసుకుని ఇతరులకు ఇబ్బంది కల్గకుండా నగర పోలీసులు సూచించిన రూట్లలో కొనసాగాలన్నారు. బాణసంచా కాల్చడం చేయరాదన్నారు. అసాంఘిక శక్తులు, అల్లరిమూకలపై ప్రత్యేక నిఘా ఉంచామని.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు, పిల్లలు పాల్గొనే ప్రదేశాల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. నిమజ్జనం ప్రదేశాలలో వద్ద పోలీసు సిబ్బందితో పాటు ఈతగాళ్లను, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందిని, ఫైర్ సర్వీస్ సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. శోభాయాత్ర పోలీసుల సూచనలు, అధిక శబ్దం కలిగించే డిజేలను వాడకండి.. ఉల్లంఘిస్తే చర్యలు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించండి, రహదారులపై వాహనాలను అడ్డుగా నిలపవద్దు. నిమజ్జన సమయంలో పోలీసుల సూచనలు, మార్గదర్శకాలు పాటించండి. మద్యపానం చేసి వేడుకల్లో పాల్గొనవద్దు. చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రార్థనా మందిరాల వద్ద మతసామరస్యానికి దెబ్బతీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సామాజిక మాధ్యమాలలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు.. శుక్రవారం వినాయక విగ్రహాల నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా అనంతపురము నగరంలో నిర్ణయించిన రూట్ మ్యాప్ ఇదే.. రూట్ నెం.1 : తాడిపత్రి బస్టాండ్, బసవన్నకట్ట, సూర్యనగర్ సర్కిల్, సప్తగిరి సర్కిల్ వీటితో పాటుగా జేఎన్టీయూ కలెక్టరేట్ వైపు వచ్చే విగ్రహాలు కూడా సంఘమేష్ సర్కిల్ మీదుగా సూర్యనగర్ సర్కిల్ వద్ద జాయిన్ అయ్యి, సప్తగిరి సర్కిల్ చేరుకుంటారు. అలాగే హౌసింగ్ బోర్డు, విద్యుత్ నగర్ సర్కిల్, నాయక్ నగర్, ఆదర్శ నగర్ వైపు విగ్రహాలు, అశోక్ నగర్, సాయి నగర్‌ల ద్వారా నేరుగా సప్తగిరి సర్కిల్ వద్ద జాయిన్ అవుతారు. రూట్ నెం.2 : ఒకటవ రోడ్డు నుండి ఆరవ రోడ్డు వరకు, రామచంద్ర నగర్ వైపు నుండి వచ్చే విగ్రహాలు సైఫుల్లా పై ఓవర్ బ్రిడ్జ్ మీదుగా శ్రీకంఠం సర్కిల్ వద్ద జాయిన్ అయ్యి, ఎన్టీఆర్ సర్కిల్, టవర్ క్లాక్, పిటిసి పై ఓవర్ బ్రిడ్జ్ మీదుగా నడిమివంక చేరుకుంటారు. రూట్ నెం.3: రుద్రంపేట, రామ్ నగర్, లక్ష్మీనగర్, శ్రీంగర్ కాలనీల వైపు నుండి వచ్చే విగ్రహాలు రామ్ నగర్ పై ఓవర్ మీదుగా ప్రభుత్వ ఆసుపత్రి సర్కిల్, తెలుగుతల్లి సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా సప్తగిరి సర్కిల్ వద్ద జాయిన్ అవుతారు.




నిమజ్జన ప్రదేశాలు : 1) ఆత్మకూరు మండలం, పంపనూరు హెచ్ ఎన్ ఎస్ ఎస్ కెనాల్ వద్ద (4 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు కలిగిన విగ్రహాలు)

2) అనంతపురం రూరల్ మండలం, రాచానపల్లి అక్కమ్మ గార్ల గుడి వద్ద గల చెక్ డ్యామ్ వద్ద (4 అడుగుల లోపు ఎత్తు కలిగిన విగ్రహాలు) అనంతపురం రూరల్ మండలం, రాచానపల్లి న్యూ పై ఓవర్ బ్రిడ్జ్ వద్ద (4 అడుగుల లోపు ఎత్తు కలిగిన విగ్రహాలు). గణేష్ నిమజ్జనం నేపథ్యంలో.. నగరంలో ట్రాఫిక్ మళ్లింపు : అనంతపురం నగరవాసులకు, బయట నుంచి వచ్చు వాహనదారులకు గమనించాల్సిన విషయం.. శుక్రవారం ఉదయం నుండి 6 నుండి శనివారం ఉదయం 6 గంటల వరకు గుత్తి వైపు నుండి వచ్చు ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు మిర్చి యార్డ్, మీదుగా ఆర్టీసీ బస్టాండు వైపు వెళ్లాలి. తాడపత్రి వైపు నుండి వచ్చు ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు ఎన్టీఆర్ మార్గ్ మీదుగా వెళ్లాలి. కళ్యాణదుర్గం, బళ్లారి, రుద్రంపేట వైపు నుండి వచ్చు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు తపోవనం మీదుగా తడికలేరు, గుత్తి రోడ్, మిర్చి యార్డ్ మీదుగా వెళ్ళవలసి ఉంటుంది. కావున వాహనదారులు అందరూ సహకరించాలని ఎస్పీవిజ్ఞప్తి చేశారు.

# విద్యుత్ షాక్ తో మరణించిన కుటుంబానికి ఆర్థిక సాయం

అనంతపురం, సెప్టెంబర్ 17 అనంత సూర్య : నాలుగేళ్ల క్రితం విద్యుత్ షాక్ తో మరణించిన వ్యక్తి కుటుంబానికి ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో ఆర్థిక సాయం అందింది. రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి చెందిన కురుబ ఓబులపతి 4సంవత్సరాల క్రితం విద్యుత్ షాక్ తో మరణించారు. ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ గారి దృష్టికి ఎమ్మెల్యే సునీత తీసుకెళ్లారు. అయన తక్షణమే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 1లక్ష 50వేల రూపాయలను మంజూరు చేశారు. ఎమ్మెల్యే సునీత అనంతపురం క్యాంపు కార్యాలయంలో ఓబులపతి భార్య కురుబ లక్ష్మీదేవికి చెక్కును అందజేశారు. చెక్కును అందుకున్న లక్ష్మీదేవి ఇతర కుటుంబసభ్యులు



ఎమ్మెల్యే సునీతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎవరైనా కష్టాల్లో ఉన్నారంటే సాయం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఎప్పుడూ ముందుంటారని ఎమ్మెల్యే సునీత అన్నారు. ఈ రెండేళ్లలో ఎంతో మంది టీడీపీ కార్యకర్తల కుటుంబాలతో పాటు సామాన్య ప్రజల్ని ఆదుకున్నారన్నారు. మరోవైపు నీట్ లో ర్యాంక్ సాధించిన విద్యార్థిని ఎమ్మెల్యే సునీత అభినందించారు. రాప్తాడు మండల కేంద్రానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు పంపు ఇంద్రశేఖర్ కుమారుడు పంపు మనుకృష్ణ నీట్ పరీక్ష నందు 3196వ ర్యాంక్ సాధించాడు. నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల నందు వైద్య విద్యను అభ్యసించడానికి అనుమతి పొందాడు. మనుకృష్ణ ఎమ్మెల్యే సునీతతో అనంతపురం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవగా.. ఆమె అతన్ని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్ లో వైద్య విద్యలో రాణించి ప్రజలకు సేవలందించాలని సూచించారు.

# కింది స్థాయి కార్యకర్త నుంచి మా వరకు పార్టీలో అంతా సమానమే

అనంతపురం, సెప్టెంబర్ 17 అనంత సూర్య : కింది స్థాయి కార్యకర్త నుండి మా వరకు పార్టీలో అంతా ఒక్కటేనని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనకు సంబంధించి వారు పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముందుగా రాప్తాడు టీడీపీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్ల గురించి చర్చించారు. అనంతరం చెన్నేకొత్తపల్లిలో కూడా పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మంత్రి నారా లోకేష్ ఈనెల 22వ తేదీన రాప్తాడుకు రానున్నారని.. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, అలాగే మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాలను మంత్రి లోకేష్ ఆవిష్కరించనున్నారని ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ చెప్పారు. విగ్రహాల ఆవిష్కరణ అనంతరం బహిరంగ సభ, కార్యకర్తల సమావేశం జరగనుందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ కార్యక్రమం మనకు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉంటుందన్నారు. రాప్తాడులో లోకేష్ పర్యటనకు ముందు ర్యాలీ ఉంటుందన్నారు. చెన్నేకొత్తపల్లిలో జరిగిన సమావేశంలో కూడా లోకేష్ పర్యటనగురించి చర్చించారు. చెన్నేకొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా పా-




ఠశాల అదనపు భవనాలను పరిశీలించిన ఎమ్మెల్యే పరిటాల సునీత గారు ఈ నెల 22వ తేదీన నారా లోకేష్ గారు ఈ భవనాలను ప్రారంభిస్తారన్నారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కిందిస్థాయి కార్యకర్త నుండి మా వరకు అందరూ ఒకటే.. అందరం సమానమేనని. పార్టీ కార్యక్రమం అనేది ప్రతి ఒక్కరి సొంత కార్యక్రమం అన్నారు. నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకొని, గ్రామాలలోని ప్రతి ఒక్క కిందిస్థాయి కార్యకర్తలను, అభిమానులను ఈ విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవంలో భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. సమావేశం అనంతరం పరిటాల శ్రీరామ్



క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. మంత్రి లోకేష్ పర్యటన సందర్భంగా నిర్వహించబోయే ర్యాలీ రూట్ మ్యాప్, సభాస్థలి, భోజన, విగ్రహాల ఏర్పాటు ప్రాంతాన్ని ఆయన క్షుణ్ణంగా చూశారు. సభకు వచ్చే వేలాది మంది ప్రజలు, కార్యకర్తలకు ఇబ్బంది కలగకుండా భోజన వసతులు, తాగునీరు మరియు వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై నాయకులకు, కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. మరోవైపు ఎమ్మెల్యే పరిటాల సునీత రాప్తాడు మండల కేంద్రానికి చెందిన చెడిపోతుల వెంకటేష్ గత వారంలో అనారోగ్యానికి గురై మరణించగా వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించి 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం రాప్తాడులోని 'అన్న క్యాంటీన్'ను సందర్శించారు. ఇక్కడ భోజన నాణ్యతపై ఆరా తీశారు. ఈ క్యాంటీన్ ఏర్పాటు వలన ఎంత వరకు ప్రయోజనం ఉందన్నది తెలుసుకున్నారు. భోజనం నాణ్యతలో ఎక్కడా రాజీ పడవద్దని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు.

# ప్లాస్టిక్ రహిత, పరిశుభ్రమైన నగరమే మా లక్ష్యం

అనంతపురం, సెప్టెంబర్ 17 అనంత సూర్య : ప్లాస్టిక్ రహిత, పరిశుభ్రమైన నగరమే మా లక్ష్యమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహించిన 'స్వచ్ఛతా హి సేవా' ర్యాలీలో ఆయన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి పాల్గొన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్, అధికారులు, సిబ్బంది స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులతో కలిసి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. పరిశుభ్రతపై టవర్ క్లాక్ వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్, వికసిత భారత్ లక్ష్యంగా పెట్టుకున్న ప్రధానమంత్రి మోదీ జన్మదినం సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 30రోజులపాటు వివిధ కార్యక్రమాలు ఉంటాయని.. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర లక్ష్యానికి అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి 3వ శనివారం విభిన్నమైన కార్యక్రమాలు చేపట్టేలా చూస్తున్నారన్నారు. ఒక్కో శనివారం ఒక్కో థీమ్ తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో కోటి 85లక్షల టన్నుల చెత్త పెట్టిపోతే దాన్ని తీసివేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుందన్నారు. అనంతపురం నగరంలోని




డంపింగ్ యార్డ్ లో 3లక్షల టన్నుల ఉండిపోయిందని.. దీనిని పూర్తిగా తొలగిస్తున్నామన్నారు. ఇప్పటికే 2లక్షల టన్నుల చెత్త తీసివేశామని.. త్వరలోనే మిగిలింది కూడా తీసి వేసి ఇక్కడ ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మిగిలిన స్థలంలో పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని కార్యక్రమాలు చేస-్తున్నా.. ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. నా ఇల్లు, నా వీధి, నా నగరం, నా రాష్ట్రం, నా దేశం పరిశుభ్రంగా ఉండాలనేది ప్రతి ఒక్కరిలో ఉంటేనే స్వచ్ఛ భారత్ సాధ్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ లక్ష్యానికి అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు గ్రామస్థాయి నుంచి జరుగుతాయని.. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్, ఎంహెచ్ వో రాజా రవీంద్ర, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# ఆయుష్ శాఖ వారిచే ఉచిత వైద్య శిబిరం

అనంతపురం క్రైం ప్రతినిధి, సెప్టెంబర్ 17 అనంత సూర్య : భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గజన్మదినోత్సవం సందర్భంగా ఆయుష్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో కడప రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో, యునాని డాక్టర్ల ఆధ్వర్యంలో అనంతపురం కెఎసఆర్ గర్ల్స్ హైస్కూలులో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా



మూడు శాఖల డాక్టర్లు దాదాపు 650 మంది విద్యార్థినులకు సీజనల్ వ్యాధిపై అవగాహన కల్పించి చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద సీనియర్ డాక్టర్. రత్న చిరంజీవి, హోమియో సీనియర్ డాక్టర్ లాల్యానాయక్, యునాని డాక్టర్ రఫీక్, సిబ్బంది మహేంద్ర బాబు, తిపేంద్ర నాయక్, శివ శంకరమ్మ, సుధాకర్, శ్రీనివాసులు, సునీల్ బాబు, యోగా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పట్ల నీ దొంగ దీక్షలు ఆపు ప్రకాష్ రెడ్డీ..



అనంతపురం, సెప్టెంబర్ 17 అనంత సూర్య : రాప్తాడు నియోజకవర్గం రైతుల పట్ల నీవు చేస్తున్న దొంగ దీక్షలు ఆపు ప్రకాష్ రెడ్డీ అని, శ్యాశ్వతంగా సాగునీరు అందించాలని పేరూరు ప్రాజెక్ట్‌కు 805 కోట్ల రూపాయలు బడ్జెట్ తెచ్చి కాలువ పనులు ప్రారంభించి 80 శాతం పనులు పూర్తి చేసి రైతుల గుండెల్లో వెలుగు నింపిన ఘనత రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మదని టీఎనఎసఎఫ్ రాష్ట్ర నాయకులు బండి పరశురాం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలంలో వర్షాలు రాక పంటలు పండక రైతులు అనేక ఇబ్బందులు పడుతుంటే హంద్రీనీవా కాలువ ద్వారా రాప్తాడు నియోజకవర్గం పరిధిలో ఉన్న ప్రతి చెరువుకు సాగునీరు పరిటాల సునీతమ్మ అందిస్తోందన్నారు. పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాప్తాడు ప్రజలకు తాగునీరు అందించాలని వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేసిన ఘనత పరిటాల సునీతమ్మకు దక్కుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధితో పాటు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వాతావరణ బీమా ప్రకటిస్తూ ప్రతి రైతుకు 20 వేలు రూపాయలు అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. అధికారం కోల్పోయి రాప్తాడు ప్రజలు నిన్ను ఎవరు పట్టించుకోలేదని జల దీక్ష పేరుతో మరొక్కసారి ప్రజలను మోసం చేయాలనే ప్రయత్నం మానుకో ప్రకాష్ రెడ్డి హితవు పలికారు. 2019 నుంచి 2024 వరకు రైతుల సమస్యలు పక్కన పెట్టి, నీవు.. నీ కుటుంబ సభ్యులు దొంగల ముఠాగా గ్రూపులు ఏర్పడి దోపిడీలు, దందాలు, అక్రమ వసూళ్లు చేసి వందల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించి రైతుల కోసం జల దీక్ష అంటూ దొంగ నాటకాలు మానుకోవాలన్నారు. పేరూరు డ్యాం పనులు పూర్తి అయితే రైతులకు శ్యాశ్వతంగా సాగునీరు అందుతుందని తెలిసి కూడా పనులు పూర్తి చేయకుండా ఉన్న బడ్జెట్‌ను మూడు ముక్కలు చేసి మూడు ప్రాజెక్టులు కడుతానని కనీసం ఒక గంప మట్టి కూడా తవ్వని దద్దమ్మ నీవన్నారు. నీ సొంత గ్రామమైన తోపుదుర్తి గ్రామానికి సాగునీటి ప్రాజెక్ట్ కడుతానని తోపుదుర్తి గ్రామ రైతుల నుంచి సాగు భూములు భూ సేకరణ చేపించి కనీసం అక్కడ ప్రాజెక్ట్ ఊసే లేకుండా రైతులకు భూములు లేకుండా చేసిన దుర్మార్గుడు కాదా.. అని ప్రశ్నించారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ద్వారా రాప్తాడు నియోజకవర్గం ప్రజలలో పరిటాల అనే పేరును చిరస్థాయిగా ప్రజల గుండెల్లో గూడు కట్టుకునే పరిస్థితిని చూసి ఓర్వలేక పరిటాల కుటుంబంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నావని, అందుకే నిన్ను రాప్తాడు ప్రజలు మూడు సార్లు ఓడించారన్నది గుర్తు పెట్టుకోవాలని పేర్కొన్నారు.

# రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

## - ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, సెప్టెంబర్ 17 అనంత సూర్య : రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయవచ్చని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో అనంతపురం క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరంలో బీజేపీ



నాయకులతో కలిసి ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని, వికసిత్ భారత్ - 2047 లక్ష్యంతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఆయన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనపండ్ల రాజేష్, రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి, జిల్లా నాయకులు, యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



అనంతపురం, సెప్టెంబర్ 17 అనంత సూర్య : అనంతపురం నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదిన వేడుకలను ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, టిడిపి, బిజెపి శ్రేణులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు దీపాలు వెలిగించి ఆశీర్వాద్ కా దియా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలను ఆకాంక్షిస్తూ ప్రత్యేకంగా కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ కేవలం భారతదేశానికే కాదు, ప్రపంచ దేశాలకే దిక్సూచిలా నిలిచారన్నారు. గత 12ఏళ్లుగా ఆయన అందిస్తున్న సుస్థిర పాలన, దేశానికి ఆయన చేస్తున్న సేవలు మరే నాయకుడు అందించలేదన్నారు. పేదరిక నిర్మూలన, దేశ భద్రత, ఆర్థికాభివృద్ధి రంగాలలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబుల్ ఇంజన్ పాలనతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా అభివృద్ధి గతంలో దూసుకెళ్తోందని ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, నసీర్ అహ్మద్ పేర్కొన్నారు.

## అసిఫ్ ఆధ్వర్యంలో అన్నదానం

అనంతపురం, సెప్టెంబర్ 17 అనంత సూర్య : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నగర ఉపాధ్యక్షులు, 1వ డివిజన్ నాయకులు ఆలూరు మహమ్మద్ ఆసిఫ్ ఆధ్వర్యంలో నగరంలోని 1వ డివిజన్ పరిధిలోని ఎర్రనేల కొట్టాలలోని మున్సిపల్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దాదాపు 250 మందికి పైగా భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మహ్మద్ ఆసిఫ్ మాట్లాడుతూ.. హిందూ ముస్లింలకు ఒక్కటేనని నిరూపించే మొహర్రం పండుగ ఒకటైతే.. వినాయక చవితి పండుగ మరొకటన్నారు. కుల మతాలకతీతంగా వినాయక చవితి పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. విఘ్నాలు తొలిగి ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆది గురువు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



## వయోపరిమితి పత్రాల ఆలస్యంతో వృద్ధుల మృతి విచారణ జరిపి, మెగా క్యాంపులు పెట్టాలని వినతి



విజయనగరం (అనంత సూర్య ప్రతినిధి): జిల్లాలో వృద్ధులకు వయసు నిర్ధారణ పత్రాలు అందక, ఆ నిరీక్షణలోనే పలువురు వృద్ధులు మరణించారని, దీనిపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయనగరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం దాఖలైంది. పాఠశాల విధాన కమిటీ మాజీ ఛైర్మన్ ఎస్. శ్రీనివాసరావు జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వృద్ధుల సంక్షేమం పట్ల అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ద్వారా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు పంపిన జాబితాలోని దాదాపు మూడు వేల ఏడు వందల ముప్పై మూడు మంది వృద్ధులలో, పత్రాలు అందక ఎంతమంది మరణించారో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుని, మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వృద్ధులు ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవస్థలు తప్పించేందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు తగిన ఆదేశాలు జారీ చేసి వెంటనే మెగా వైద్య శిబిరాలు ప్రారంభించాలని, ప్రతి వారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో, బస్ స్టాండ్ వద్ద, అలాగే నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద విడతల వారీగా మెగా క్యాంపులు నిర్వహించి వయసు నిర్ధారణ పత్రాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఆలస్యం చేయకుండా వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## కౌసల్యం' ఉద్యోగ మేళా ప్రతినిధులకు నియామక పత్రాల అందజేత

(అనంత సూర్య, విజయనగరం ప్రతినిధి): జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన 'కౌసల్యం' ఉద్యోగ మేళాలో మొదటిరోజు ఎంపికైన 136 మంది నిరుద్యోగ యువతకు జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు నియామక పత్రాలు అందజేశారు. ఈ ఉద్యోగ మేళా సెప్టెంబర్ 18వ తేదీ శుక్రవారం కూడా కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హత ధ్రువపత్రాలు మరియు ఇతర అవసరమైన పత్రాలతో హాజరై ఇంటర్వ్యూలలో పాల్గొని ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఆర్‌ఓ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వర్ణ గ్రామ్ స్వర్ణ వార్డు అధికారి ఎం కిరణ్ కుమార్ మరియు స్వర్ణ గ్రామ్ స్వర్ణ వార్డు జిల్లా కోఆర్డినేటర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు ప్రముఖ సంస్థ గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బంది మరియు ఎంపికైన అభ్యర్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## విజయనగరం పట్టణాభివృద్ధికి రూ.6.88 కోట్లతో అభివృద్ధి పనులు

### ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు





(అనంత సూర్య, విజయనగరం ప్రతినిధి): విజయనగరం పట్టణ సమగ్ర అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ. 6.88 కోట్ల నిధులు మంజూరయ్యాయని విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు తెలిపారు. ఈ నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు గురువారం స్థానిక 1వ డివిజన్ లక్ష్మీగణపతి కాలనీలో ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన వసతులు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. డ్రైయిన్లు రోడ్ల నిర్మాణంతో పాటు ప్రజా అవసరాలకు తగినట్లుగా పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు మరియు నాయకులు పాల్గొన్నారు.

## రూ.200 కోట్లతో 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు: ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పరిశీలన





(అనంత సూర్య, విజయనగరం ప్రతినిధి): విజయనగరం పట్టణ పరిధిలోని 1వ డివిజన్ వేణుగోపాలపురంలో నిర్మిస్తున్న నూతన 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుమారు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ సబ్‌స్టేషన్ నిర్మాణ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు భవిష్యత్తులో విద్యుత్ కొరత లేకుండా నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అందించడానికే ఈ భారీ ప్రాజెక్టును చేపడుతున్నామని తెలిపారు. నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలకు కట్టుబడి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఇంజనీర్లను ఆదేశించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే ప్రాంతీయంగా లో-వోల్టేజ్ సమస్య తీరడంతో పాటు విద్యుత్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు స్థానిక నాయకులు మరియు ప్రతినిధులు పాల్గొన్నారు

## విశ్వకర్మ భగవానుడు ఈ సృష్టికి మూలం : ఎమ్మెల్యే దగ్గుపాటి

### నగరంలో ఘనంగా విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు

అనంతపురం, సెప్టెంబర్ 17 అనంత సూర్య : విశ్వకర్మ భగవానుడు ఈ సృష్టికి మూలమని, మనిషి నాగరికతలో విశ్వబ్రాహ్మణుల పాత్ర ఎంతో ఉందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం నగరంలో శ్రీ విరాట్ విశ్వకర్మ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. నగరంలోని పాతూరులో వెలసిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమానికి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజ-రయ్యారు. ముందుగా నగరంలోని విశ్వబ్రాహ్మణులు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా స్వయంగా బైక్‌లు నడుపుతూ విశ్వబ్రాహ్మణుల్లో ఉత్సాహాన్ని నింపారు. "జై విశ్వకర్మ", "విశ్వకర్మ భగవాన్ కీ జై" అంటూ విశ్వబ్రాహ్మణులు చేసిన నినాదాలతో నగర వీధులన్నీ మారుమ్రోగాయి. ర్యాలీ అనంతరం జగద్గురు విరాట్ విశ్వకర్మ భగవానుడి విగ్రహానికి ఘనంగా పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, శిల్ప, కళా రంగాల్లో రాణిస్తున్న విశ్వబ్రాహ్మణులకు



భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వారు ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది గురు ప్రసాద్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి, స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ విశ్వకర్మ భగవానుడు ఈ సృష్టికి మూలమన్నారు. ఆయన ఐదుగురు సంతానమైన మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞుల ద్వారానే ఈ సమాజానికి అవసరమైన ఇనుము, కలప, రాగి, శిల, బంగారం వంటి పంచ వృత్తులు లభించాయన్నారు. మానవ నాగరికత నిర్మాణంలో విశ్వబ్రాహ్మణుల పాత్ర ఎంతో ఉందన్నారు. వారు లేకపోతే సమాజ గమనం లేదు, దేశ ప్రగతి లేదన్నారు. ప్రధాన మంత్రి జన్మదినం కూడా ఈ రోజు కావడం విశేషమన్నారు. విశ్వబ్రాహ్మణులకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. మరోవైపు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విశ్వకర్మ సృష్టికి మూలమని..అందుకే దీనిని గుర్తించిన ప్రధాన మంత్రి మోదీ ఒక పండుగగా జయంతి వేడుకలను నిర్వహిస్తున్నారన్నారు. శ్రమించే కార్మికుల కోసం, చేతి వృత్తుల వారి కోసం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పేరుతో సహకారం అందిస్తున్నారన్నారు. విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి, వారి కళలను, వృత్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా కృషి చేస్తామని ఎంపీ చెప్పారు. మరోవైపు లాయర్ గురుప్రసాద్, రంగాచారి మాట్లాడుతూ.. విశ్వకర్మ జయంతిని బీజేపీ పాలిత ప్రాంతాల్లో సెలవు దినంగా ప్రకటించారని.. ఇక్కడ కూడా ఎన్డీఏ ప్రభుత్వం ఉంది కాబట్టి.. సెలవు దినంగా ఇవ్వాలని కోరారు. అలాగే ఇటీవల స్వర్ణకారులు, కంసలి, కమ్మరి, వడ్రంగి వారు కష్టాల్లో ఉన్నారని.. వారికి చేయూతనివ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

## దివ్యాంగులకు సహాయ పరికరాల పంపిణీ చేసిన ఎంపీ

అనంతపురం, సెప్టెంబర్ 17 అనంత సూర్య : అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన దివ్యాంగులకు వివిధ రకాల సహాయ పరికరాలను అందజేసే కార్యక్రమం గురువారం అనంతపురం నగరంలోని ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆలింకో ద్వారా అమలు చేస్తున్న ఏడీఐపీ, వయోశ్రీ యోజన పథకాలలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు సహాయ పరికరాలను పంపిణీ చేశారు. అనంతపురం నియోజకవర్గానికి చెందిన 454 మంది దివ్యాంగులకు మొత్తం 1,194 సహాయ పరికరాలను పంపిణీ చేశారు. వీటి విలువ సుమారు రూ.70 లక్షలు. బ్యాటరీతో నడిచే మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, చేతికర్రలు, సి.పి. చైర్లు, వాకర్లు తదితర సహాయ పరికరాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేశా-రు. అదేవిధంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కార్యక్రమంలో భారీ కేక్‌ను కట్ చేసి, ప్రధానమంత్రి జన్మదిన వేడుకలను నిర్వహించారు. సేవా కార్యక్రమాలతో ప్రధానమంత్రి జన్మదినాన్ని జరుపుకోవడం స్ఫూర్తిదాయకమని ఎంపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన సహాయ పరికరాలు అందించడం ద్వారా వారి రోజువారీ జీవనంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించి, మరింత స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవించేందుకు తోడ్పాటు అందించవచ్చని




పేర్కొన్నారు. ఎంపీ తన సొంత నిధుల నుంచి రూ.5 లక్షలు వెచ్చించి ఐదుగురు దివ్యాంగులకు మోటార్ సైకిళ్లను అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా సుమారు 300 మంది లబ్ధిదారులకు రూ.70 లక్షల విలువైన వినికిడి పరికరాలను సీఎస్ఆర్ నిధుల ద్వారా అందించేందుకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షులు, సంబంధిత అధికారుల విజ్ఞప్తి మేరకు దివ్యాంగుల భవనం కోసం స్థలం రిజర్వేషన్‌కు రూ.10 లక్షల నిధులు కేటాయించేందుకు కూడా ఎంపీ ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. అనంతపురం జిల్లాలోని ప్రతి దివ్యాంగుడి సంక్షేమం, అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని ఎంపీ స్పష్టం చేశారు. 2025 సంవత్సరంలో అనంతపురం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆలింకో ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధుల గుర్తింపు, కొలత శిబిరాలను నిర్వహించినట్లు ఎంపీ తెలిపారు. ఆయా శిబిరాల్లో గుర్తించిన అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా సహాయ పరికరాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని దివ్యాంగులకు పెద్ద సంఖ్యలో లబ్ధి చేకూరేలా అర్హులైన వారిని ఎంపిక చేయడానికి కేంద్ర స్థాయిలో ప్రత్యేకంగా కృషి చేసిన అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణకు దివ్యాంగులు, దివ్యాంగుల సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం నియోజకవర్గానికి సంబంధించిన సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమం పూర్తయిన అనంతరం, మిగిలిన నియోజకవర్గాలకు సంబంధించిన పరికరాలు అందుబాటులోకి వచ్చిన వెంటనే అక్కడ కూడా పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, సంబంధిత ప్రభుత్వ శాఖలు, ఆలింకో అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పథకం నిజమైన విజయాన్ని సాధించేది అది అర్హులైన లబ్ధిదారుడి వరకు చేరినప్పుడేనని, అందువల్ల దివ్యాంగులు, వయోవృద్ధుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సహాయ పరికరాలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఎలఎసఏ కార్యదర్శి అర్చన, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సంగారెడ్డి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, జిల్లా హాస్పిటల్ కమిటీ సభ్యులు నరసింహులు, ఎడిసిసి చైర్మన్ కేశవరెడ్డి, ఆలింకో ప్రతినిధి సునీత, అధికారులు, విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు పసుపుల శ్రీనివాసరెడ్డి, కార్పొరేషన్ సిబ్బంది, దివ్యాంగుల సంఘం ప్రతినిధులు, వసతి గృహ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## గార్లదిన్నె గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

### - అసెంబ్లీ మైనారిటీ సంక్షేమ కమిటీ హామీ

అనంతపురం, సెప్టెంబర్ 17 అనంత సూర్య : గార్లదిన్నె మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ మైనారిటీ బాలుర రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అవసరమైన మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అసెంబ్లీ మైనారిటీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ (గుంటూరు తూ-ర్పు ఎమ్మెల్యే) మహమ్మద్ నసీర్ అహ్మద్, కమిటీ సభ్యులు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ స్పష్టం చేశారు. మైనారిటీ వెల్ఫేర్ కమిటీ పర్యటనలో భాగంగా వారు గురువారం సాయంత్రం గార్లదిన్నె మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ సభ్యులు, అర్బన్ ఎమ్మెల్యే పా-ఠశాలలోని విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి పలు వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆహారం శుచిగా ఉందా, మెనూ ప్రకారం ఆహారం పెడుతున్నారా, పుస్తకాలు యూనిఫారం అందాయా, బోధన ఎలా ఉంది అని అడుగగా, పిల్లలు వివరిస్తూ అన్నీ సక్రమంగా అందుతున్నాయని తెలుపగా సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడుగగా మరుగుదొడ్లు సరిగా లేవనీ, కొత్తవి నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. అలాగే వసతి తగినంత లేదని ఇబ్బందిగా ఉందని తెలిపారు. విద్యార్థుల పఠన సామర్థ్యం, వారి వర్క్ పుస్తకాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించి మాట్లాడుతూ బాగా చదువుకోవాలని సూచించారు. పలువురు ముస్లిం విద్యార్థులు తాము నమాజ్ చేసుకునేందుకు సరైన సదుపాయం లేదని తెలిపారు. అనంతరం వారు మరుగుదొడ్లు, కిచెన్ షెడ్‌నీ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా గార్లదిన్నెలోని మైనారిటీ బాలుర గురుకులాన్ని పరిశీలించామని, 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు దాదాపు 408 మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తూ





బస చేస్తున్నారని తెలిపారు. ఇక్కడ ఉన్న ప్రాంగణంలో చాలీచాలని గదులతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, గత 10 సంవత్సరాల క్రితం ఇక్కడికి తరలించిన ఈ హాస్టల్‌లో కనీస మౌలిక వసతులు లేవనీ, విద్యార్థులు కింద పడుకోవాల్సిన పరిస్థితి నెలకొందనీ, పుస్తకాలు బ్యాగులు, ఇతర వస్తువులన్నీ క్లాస్‌రూమ్‌లలోనే పెట్టుకోవాల్సి వస్తోందనీ, ఈ సమస్యలను వెంటనే ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఎండి దృష్టికి, ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లి హాస్టల్‌కు అవసరమైన అన్ని వసతులు, అత్యవసర సౌకర్యాలు కల్పించేలా కమిటీ చర్యలు తీసుకుంటుందనీ తెలిపారు. గత పదేళ్లుగా నెలకు రూ.15 వేల చొప్పున గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తూ, విద్యార్థులను కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్న ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయం అని అన్నారు. స్థానిక శాసనసభ్యులతో సమన్వయం చేసుకొని, కమిటీ ద్వారా ప్రభుత్వానికి నివేదించి అవసరమైన బడ్జెట్‌ను మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా మైనారిటీ సమస్యల పరిష్కారం, అవగాహన కల్పించడమే లక్ష్యంగా కమిటీ పర్యటిస్తోందన్నారు. అంతకుముందు శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల చేరికలు, అధ్యాపకుల నియామకాల్లో రోస్టర్ అమలు తీరును పరిశీలించామని, కలెక్టరేట్‌లో ముస్లిం మైనారిటీ సంఘాల నుంచి వినతులు స్వీకరించామని తెలిపారు. గార్లదిన్నె రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో సమస్యలపై అందిన వినతి మేరకు ఇక్కడికి రావడం జరిగిందనీ, రాష్ట్రంలోనే అత్యధిక విద్యార్థులు కలిగిన పాఠశాలల్లో ఇది ఒకటి అని, ఉపాధ్యాయుల బోధన, భోజనం నాణ్యత బాగున్నప్పటికీ, మౌలిక వసతులు లేక దాదాపు 400 మంది విద్యార్థులు దుర్భర పరిస్థితుల్లో ఒకేచోట చదువుతూ, అక్కడే పడుకుంటున్నారని, 2016లో కేవలం 200 మంది విద్యార్థులు ఉన్నప్పుడు తరలించిన ఈ భవనాల్లో, ప్రస్తుతం 400 పైచిలుకు విద్యార్థులు ఉండటంతో స్థలం సరిపోవడం లేదన్నారు. విద్యార్థులకు అవసరమైన అదనపు తరగతి గదులు, హాస్టల్ భవనాలు, డైనింగ్ హాల్, ప్రేయర్ రూమ్, సరిపడా మరుగుదొడ్లు, తాగునీటి వసతిని యుద్ధప్రాతిపదికన సమకూర్చేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వేగవంతమైన చర్యలు చేపడతామని తెలిపారు. పర్యటనలో మైనారిటీ కమిటీ సభ్యులు ఇషాక్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రామ సుబ్బారెడ్డి, ఇతర అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405